క్లుప్తంగా

రోడ్లపై చెత్త వేస్తే చర్యలు

చీరాల టౌన్: ఇళ్లల్లో నుంచి వచ్చిన చెత్తను రోడ్లపై వేసేవారిపై చర్యలు తీసుకుంటామని గ్రామాల ప్రజలు చెత్తను పంచాయితీ గ్రీన్ అంబాసిడర్లకు అందించాలని ఈపురుపాలెం పంచాయతీ కార్యదర్శి మురళీబాపూజీ సూచించారు. శుక్రవారం పద్మనాభునిపేట, గాంధీపార్కు, సీతారాంపేట, నలభై ఇళ్లు, ఇందిరానగర్, బావనారుషిపేట తదితర ప్రాంతాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాన్ని నిర్వహించారు.

250 కేజీల బియ్యం వితరణ


బియ్యం అందజేస్తున్న దాతలు

పర్చూరు(చినగంజాం): స్థానిక ఆశ్రయ వృద్ధాశ్రమానికి దాతలు 250 కేజీల బియ్యాన్ని శుక్రవారం అందజేశారు. తులాబంధుల అర్జునయ్య, అనసూయమ్మ జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు నెలరోజులకు సరిపోయే బియ్యం అందజేశారు. నిర్వాహకులు వనం శ్రీనివాసరెడ్డి, జయలక్ష్మి దంపతులు, ఆశ్రమ కార్యనిర్వాహణాధికారి సాయి ధన్యవాదాలు తెలియజేశారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

జె.పంగులూరు: మండల పరిధిలోని ముప్పవరం సబ్ స్టేషన్ పరిధిలో నేడు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు కరెంట్ ఏఈ ఏ అంజనేయులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మరమ్మతుల నిమిత్తం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటలకు వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. అలవలపాడు, రేణింగవరం, కశ్యాపురం, జాగర్లమూడివారిపాలెం, బైటమంజలూరు, నార్నెవారిపాలెం, కొండమూరు గ్రామాల పరిధిలో విద్యుత్ వినియోగ దారులు గమనించి సహకరించాలని కోరారు.

చీరాల అర్బన్: పట్టణ పరిధిలోని సబ్‌స్టేషన్ విద్యుత్ లైన్ల మరమ్మతుల నేపథ్యంలో శనివారం ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు శుక్రవారం తెలిపారు. ముంతావారిసెంటర్, కూరగాయల మార్కెట్, పాపరాజుతోట, బెస్తపాలెం, ఎంజీసీ మార్కెట్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు.

హైస్కూల్‌కు లాప్ టాప్ అందజేత


ఉపాధ్యాయులకు ల్యాప్ టాప్ అందజేస్తున్న దాత

జె.పంగులూరు: మండలంలోని బూదవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు అజిత్ కుమార్ చారిటబల్ ట్రస్ట్ చైర్మన్ వద్దవల్లి వీరనారాయణ శుక్రవారం ల్యాప్ టాప్ అందజేశారు. రూ. 25 వేలు విలువ గల ల్యాప్ టాప్‌ను ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అందుకున్నారు.

విశ్రాంత డీఎస్‌డీఓ శ్రీనివాస ప్రసాద్ మృతి

చీరాల అర్బన్: విశ్రాంత డీఎస్‌డీఓ జి.శ్రీనివాస ప్రసాద్ (80) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. చీరాల్లోని సర్వమిత్ర వ్యాయామశాలను నిర్వహిస్తూ వందలాది మంది వెయిట్‌లిఫ్టర్లు, పవర్ లిఫ్టర్లను తయారు చేశారు. సీనియర్ కోచ్ మరణంపై క్రీడాకారులతో ప్రగాఢ సంతాపం తెలిపారు.

శునకాల దాడి.. ప్రజలకు హాని

- మందలుగా సంచరిస్తున్న కుక్కలు
- గాయాల పాలవుతున్న స్థానికులు
- ప్రతి రోజూ వైద్యశాలకు 5 నుంచి 6 గురు బాధితులు
- వేటపాలెం పంచాయతీలో ఫిర్యాదు చేసినా ప్రయోజనం శూన్యం


రైల్వే ప్లాట్‌ఫాంపై కుక్కల మంద

వేటపాలెం: గ్రామాల్లో కుక్కల బెడదతో ప్రజలు అడుగు బయట పెట్టాలంటే హడలెత్తి పోతున్నారు. ఎటువైపు నుంచి వచ్చి కుక్కలు దాడి చేస్తాయోనని ఆందోళన చెందుతున్నారు. వీధుల్లో గుంపులుగా తిరుగుతూ కనిపించిన వారిపై దాడి చేస్తుండటంతో ప్రజలు భయాందోళనలు చెందుతున్నారు. దీనిపై ప్రజలు గ్రామ పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. దీంతో గ్రామాల్లో ప్రజలు అను క్షణం భయం భయంగా రోడ్లపై రాకపోకలు సాగించాల్సి దుస్థితి నెలకొంది.

రోడ్డుపై వెళ్లాలంటే భయం..

గ్రామ పరిధిలో రైల్వే స్టేషన్ రోడ్డు, చిన్నబజార్, పెద్దబజార్, మార్కెట్ సెంటర్, కుందేరు రోడ్డు, నాయినపల్లి, సర్వోదయ కాలనీ, దేశాయిపేట, చీరాల–ఒంగోలు చీరాల ప్రధాన రహదారి, రైల్వే ప్లాట్ ఫాం, అంబేడ్కర్ నగర్, హిమామ్‌నగ్, రావూరిపేట, పందిళ్లపల్లి, ప్రాంతాల్లో వీధికుక్కల బెడద తీవ్రంగా ఉంది. రోడ్లపై పదుల సంఖ్యలో సంచరిస్తుండటంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ప్రధానంగా వద్దులు, చిన్నపిల్లలు బయటకు రావాలంటే జంకుతున్నారు.

తూతూ మంత్రంగా చర్యలు..

కుక్కల బెడద పై ఫిర్యాదు వెల్లువెత్తడంతో అధికారులు తూతూ మంత్రపు చర్యలతో సరిపెడుతున్నారు. గతం కుక్కులు పశువుల పాకల్లో ఉన్న నాలుగు లేక దూడలపై దాడి చేసి చంపి వేశాయి. మరో ఐదు దూడలను గాయ పరిచాయి. దీనిపై ఫిర్యాదులు వెల్లువెత్తడంతో తూతూ మంత్రంగా కొన్ని కుక్కలను మాత్రమే పట్టి దూరంగా వదిలేశారు. ఆ తరువాత కుక్కల బెదను తొలగించడానికి ఎటువంటి చర్యలు చేపట్టలేదు. దీనితో గ్రామాల్లో వందల సంఖ్యలో కుక్కలు పెరిగిపోయాయి.

వైద్యశాలకు పరుగులు

ప్రతి రోజూ కుక్కల దాడి చేసి కరిచిన వారు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి 4 నుంచి 5 గురు రాబీస్ ఇంజెక్షన్‌ల కోసం వస్తున్నారు. మరి కొంత మంది ప్రైవేట్ వైద్యశాలలకు పరుగులు తీస్తున్నారు. ఇప్పటికైనా గ్రామ పంచాయతీ అధికారులు కుక్కల తరలింపునకు చర్యలు చేపట్టాలను ప్రజలు కోరుతున్నారు.

రోజూ కేసులు వస్తున్నాయి

కుక్కలు దాడిలో గాయపడిన వారు వైద్యశాలకు తరచూ వస్తున్నారు. ర్యాబిస్ ఇంజక్షన్‌లు వేస్తున్నాం. ప్రజలు వీధి కుక్కలతో జాగ్రత్తగా ఉండాలి. కుక్కులు కరిచిన వారు అశ్రద్ధ చేయకుండా ర్యాబిస్ ఇంజక్షన్ తప్పక వేయించుకోవాలి.

– స్వాతి కిరణ్, వైద్యాధికారి, వేటపాలెం

రైతులు రోడ్డెక్కుతుంటే సంబరాలా?


ఉప్పుమాగులూరులో మండల కన్వీనర్, స్థానిక నాయకులు

బల్లికురవ: రైతులు పండించిన టమాటా, ఉల్లి, సొర, కూరగాయాలకు గిట్టుబాటు ధర రావడంలేదని.. కొనే నాథుడు లేక రోడ్లపై పారబోస్తున్నారని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దేవినేని కృష్ణబాబు ధ్వజమెత్తారు. శుక్రవారం రాత్రి ఉప్పుమాగులూరులో బాబు ష్యూరిటీ, మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఖరీఫ్ వ్యవసాయ సీజన్ ఆరంభమై 3 నెలలైనా యూరియా దొరక్క ఎరువుల దుకాణాల ముందు రైతులు క్యూకడుతూ రోడ్డుకెక్కుతున్న ముఖ్యమంత్రి వ్యవసాయశాఖ మంత్రి పట్టించుకోవడం లేదన్నారు. సూపర్‌సిక్స్–సూపర్ హిట్ అంటూ సంబరాలు చేసుకుంటున్నారని సూపర్ హిట్ అయితే అర్హులకు పథకాలు ఎందుకు దక్కటంలేదని ప్రశ్నించారు. 10 నెలలుగా గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, గ్యాస్ ఏజెన్సీలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ లబ్ధిదారులు తిరుగుతూనే ఉన్నారని.. రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధరతోపాటు మార్క్‌ఫెడ్ ద్వారా యూరియా ఎరువులు అందించాలని పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పిలుపుమేరకు అన్నదాత పోరు చేపట్టినట్లు వివరించారు. కూటమి ప్రభుత్వం 30 పోలీస్ యాక్ట్ అక్రమ కేసులు బనాయించినా రైతులు అన్నదాత పోరును విజయవంతం చేసినట్లు కృష్ణబాబు అన్నారు. కార్యక్రమంలో కల్లి ప్రభాకరెడ్డి, సూర్యనారాయణ రెడ్డి, పూర్ణచంద్రారెడ్డి, సింగారెడ్డి, తియ్యగూర సుబ్బారెడ్డి, తనుబొద్దు రవీంద్రా రెడ్డి, పల్లెల రుద్రారెడ్డి, వీరారెడ్డి, సురేష్‌రెడ్డి, బోడాపాటి వెంకటరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, శ్యామల పున్నారెడ్డి పాల్గొన్నారు.

కూటమి పాలనలో విద్య, వైద్యం దూరం


తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు

వేటపాలెం: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ పేద ప్రజలకు విద్య, వైద్యం దూరం చేయడానికి కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని జిల్లా బహుజన సమాజ్ పార్టీ అధ్యక్షుడు గుదే రాజారావు ఆరోపించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద బహుజన్ సమాజ్ పార్టీ అధ్వర్యంలో జిల్లాలో నిర్మిస్తున్న మెడికల్ కాలేజీని ప్రభుత్వ నిధులతోనే నిర్మించాలని కోరుతూ శుక్రవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. కూటమి ప్రభుత్వం మెడికల్ కళాశాలలు ప్రైవేట్ పరం చేయడాన్ని వెనక్కు తీసుకోకపోతే ఆందోళన చేయడానికి పార్టీ వెనుకాడదన్నారు. కార్యక్రమంలో చీరాల నియోజకవర్గం ఆ పార్టీ ఇన్‌చార్జి చిట్టిమల సంగీతరావు, మహిళా మండల అధ్యక్షురాలు జ్యోతి, శివప్రసాద్, ఏసేపు, లక్ష్మి, పార్వతి, వేపూరి జోసెఫ్ పాల్గొన్నారు.

పని అడిగిన వారికి జాబ్ కార్డులు


మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ ఎంపీడీఓ వెంకటస్వామి

పర్చూరు (చినగంజాం): మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో అడిగిన ప్రతి ఒక్కరికీ జాబ్ కార్డు ఇచ్చి పని కల్పించాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ వెంకట స్వామి స్పష్టం చేశారు. శుక్రవారం మండల పరిషత్ సమావేశంలో హాలులో ఉపాధి హామీ సిబ్బందికి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అడిగిన వారికి జాబ్ కార్డు ఇవ్వకుండా నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఉపాధి పథకం కింద 100 రోజులు పని కల్పించాలని ఆదేశించారు. రికార్డులు సక్రమంగా అమలు పరచాలన్నారు. ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు 100 రోజులు కల్పించాలని ఆదేశించారు. డిప్యూటీ ఎంపీడీఓ కె. సత్యనారాయణ, ఏపీఓ రమేష్, ఉపాధి హామీ పథకం సిబ్బంది పాల్గొన్నారు.


అద్దంకి: తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలియజేస్తున్న ఏపీటీఎఫ్ సభ్యులు


బల్లికురవలో నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

మార్టూరు: రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ యూనియన్ నాయకులు హెచ్చరించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం సాయంత్రం నిర్వహించిన నిరసన ప్రదర్శనలో యూనియన్ నాయకులు మాట్లాడారు. ఉపాధ్యాయులపై పనిభారం తగ్గించాలని, బోధనేతర పనులు తొలగించాలని, పెండింగ్‌లో ఉన్న డీఏలు వెంటనే విడుదల చేయాలని, ఉపాధ్యాయ పోస్టులు వెంటనే భర్తీ చేయాలని తదితర డిమాండ్లను త్వరగా పరిష్కరించాలన్నారు. లేకుంటే ఉద్యమిస్తామని హెచ్చరించారు. తహసీల్దార్ టి. ప్రశాంతికి వినతి పత్రం అందజేశారు. రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు, స్థానిక ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


మార్టూరులో నిరసన చేస్తున్న ఉపాధ్యాయులు


జె.పంగులూరు: తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న సభ్యులు

జె.పంగులూరు: ఉద్యోగుల, ఉపాధ్యాయుల దీర్ఘకాలిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని శుక్రవారం ఏపీటీఎఫ్ సభ్యులు తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేశారు. 12వ పీఆర్‌సీ కమిషన్ నియమించి ఐఆర్ ప్రకటించాలన్నారు. తహసీల్దార్ పి. సింగారావుకు వినతి పత్రం అందజేశారు.


చీరాల : తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

అద్దంకి: ఉద్యోగ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం తీవ్రమైన అలసత్వాన్ని ప్రదర్శిస్తోందని ఏపీటీఎఫ్ మండల నాయకుడు మలాది నాగరాజు అన్నారు. డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన తెలియజేశారు. తరువాత తహసీల్దార్ శ్రీచరన్‌కు డిమాండ్‌లతో కూడిన వినతి పత్రం అందజేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం గడిచినా ఇంత వరకు వేతన సవరణలు, కరువు భత్యం వంటివి ఇవ్వలేదన్నారు. ఈహెచ్‌ఎస్ పరిమితిని రూ.25 లక్షలకు పెంచాలన్నారు. అనపర్తి రమేశ్ బాబు, కరి రామయ్య, మల్లిఖార్జనరావు, వెంకటేశ్వర్లు, శ్రీనవాసరావు, అంకయ్య, రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

బల్లికురవ: కూటమి ప్రభుత్వం అధికారాన్ని చేపట్టి 15 నెలలు పూర్తయిన ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో శ్రద్ధ చూపటం లేదని ఉపాధ్యాయులు అసహనం వ్యక్తం చేశారు. శుక్రవారం సాయంత్రం స్థానిక ఎంఆర్‌సీ కార్యాలయం ముందు నిరసనతో తహసీల్దార్ రవినాయక్ వినతి పత్రం అందజేశారు. గోలి శ్రీనివాసరావు, ఎ. ప్రశాంత్, జి. పార్థసారధి, సీహెచ్ రామకృష్ణ, కె. రాజు తదితరులు పాల్గొన్నారు.

చీరాల అర్బన్: ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ అధ్వర్యంలో తహసీల్దార్ గోపీకృష్ణకు వినతిపత్రం అందించారు. యాప్‌లు, అసెస్‌మెంట్ బుక్‌లెట్ విధానాలను రద్దు చేసి ఉపాధ్యాయులను బోధనలకే పరిమితం చేయాలని డిమాండ్ చేశారు. జి.నాగమల్లేశ్వరరావు, చేజెర్ల శ్రీనివాసరావు, ఆలూరి శ్రీనివాసరావు, జీవీఎల్ హరికిషన్, కె.వెంకటేశ్వరరెడ్డి, దండ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

అవార్డు అందుకోవడం అభినందనీయం


ఉత్తమ ఉపాధ్యాయిని దంపతులను సత్కరిస్తున్న మాజీ ఎమ్మెల్సీ, ఉపాధ్యాయులు

సంతమాగులూరు(అద్దంకి రూరల్): రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయునిగా అవార్డుందుకోవటం అభినందనీయమని మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు అన్నారు. మండలంలోని మక్కెన వారిపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు గురుపూజోత్సవం సందర్భంగా ఈనెల 5వ తేదీన రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయురాలుగా కొల్లి మోహన అంజలి అవార్డు అందుకున్నారు. శుక్రవారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్సీ హాజరయ్యారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తిలో ఇలాంటి అవార్డులు పొందటం అరుదైన విషయమన్నారు. అనంతరం మోహన అంజలి, శ్రీనివాసరావు దంపతులను సత్కరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు షేక్ ఖాశిం, మాజీ హెచ్‌ఎం జాష్టి నారాయణరావు, లక్కి నరేంద్రకుమార్, హిందీ ఉపాధ్యాయురాలు నాసర వల్లి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా హిందీ భాషా దినోత్సవం


హిందీ భాషా ప్రాముఖ్యతను వివరిస్తున్న ఉపాధ్యాయులు

చినగంజాం: మండలంలోని చెరుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హిందీ భాషా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం బెంజిమన్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో హిందీ ప్రాముఖ్యత గురించి హిందీ ఉపాధ్యాయురాలు ఝాన్సీలక్ష్మి, కె.కపూర్ అవగాహన కల్పించారు. వివిధ నమూనాలు ప్రదర్శించారు. వక్తృత్వం, వ్యాసరచన, క్విజ్, హిందీ పాటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.


అద్దంకి: మాట్లాతున్న ప్రిన్సిపాల్ మోహనరావు

అద్దంకి: శింగరకొండ సమీపంలోని కట్టారామకోటేశ్వరరావు ప్రభుత్వ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో శుక్రవారం ఘనంగా హిందీ దినత్సోవాన్ని నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ వి. మోహనరావు మాట్లాడుతూ భారత దేశంలో ఎన్నో భాషలు ఉన్నప్పటికీ హిందీ భాషకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. హిందీ అధ్యాపకుడు సత్యతనారాయణ, షర్మిలా రాణి, రామకృష్ణ, వి. ప్రసాద్ పాల్గొన్నారు.


కారంచేడు: కబడ్డీలో పోటీ పడుతున్న సీనియర్స్ విభాగంలోని విద్యార్థులు


కారంచేడు: హైజంప్‌లో ప్రతిభను కనబరుస్తున్న విద్యార్థి

క్రీడలతో ఉల్లాసం.. ఉత్సాహం

బల్లికురవ: క్రీడలు విద్యార్థులకు ఉల్లాసం, ఉత్సాహాన్నిస్తాయని గెలుపు ఓటములు సమానంగా స్వీకరించాలని ఎంఈవో- 2 కె. రమేష్‌బాబు కోరారు. శుక్రవారం ముక్తేశ్వరం ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్ 14, 17 ఖోఖో, అథ్లెటిక్స్ పోటీలను ఎంఈఓ ప్రారంభించారు. విద్యతో పాటు క్రీడల్లోనూ సత్తా చాటాలని పిలుపునిచ్చారు. విజేతలైన టీమ్‌లను చీరాల్లో జరిగే డివిజన్‌స్థాయి పోటీలకు పంపుతామని చెప్పారు. సోమవారం కొప్పరపాడు ఉన్నత పాఠశాలలో వాలీబాల్, కబడ్డీ, పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 15 పాఠశాలల నుంచి విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. పాఠశాల హెచ్‌ఎం సురేష్, పీడీ అరుణ, వివిధ పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చీరాల అర్బన్: స్కూల్స్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈనెల 16, 17 తేదీల్లో జాండ్రపేటలోని బీవీఅండ్‌బీఎన్ హైస్కూల్‌లో క్రీడలు, ఆటల పోటీలను నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ టి.రమాదేవి శుక్రవారం తెలిపారు. స్థానిక మండల విద్యావనరుల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో మండల స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్ పి.శ్రీనివాసులు, ఉపాధ్యాయులతో మాట్లాడారు. ఈనెల 16న అథ్లెటిక్స్, యోగ, చెస్ పోటీలు, 17న కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్ ఎంపిక జరుగుతుందన్నారు. ఎంపికల్లో అర్హత సాధించిన వారు డివిజన్ స్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొంటారన్నారు.


ముక్తేశ్వరం పాఠశాలలో ఖోఖో పోటీలో తలబడుతున్న విద్యార్థులు

కారంచేడు: స్థానిక యార్లగడ్డ నాయుడమ్మ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన అండర్-14, అండర్-17లో బాల, బాలికలకు కబడ్డీ, వాలీబాల్, లాంగ్‌జంప్, హైజంప్, బాడ్మెంటన్, చెస్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలను ఎంఈఓ-2 మొలబంటి వెంకటేశ్వర్లు ప్రారంభించి మాట్లాడారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జీఎఫ్ఐ) ఎంపిక పోటీలు పోటాపోటీగా సాగాయి.

సంక్షిప్తంగా

చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం పరిశీలన


చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎల్‌డీఓ పద్మావతి

జె.పంగులూరు: మండల పరిధిలోని పంగులూర సచివాలయాన్ని శుక్రవారం డీఎల్‌డీఓ పద్మావతి పరిశీలించారు. ప్రస్తుతం పలు రికార్డులు పరిశీలించారు. ఎంపీడీఓ స్వరూపారాణి, డిప్యూటీ ఎంపీడీఓ సుమంత్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు తీవ్ర గాయాలు

చీరాల అర్బన్: రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు తీవ్రగాయాలైన సంఘటన శుక్రవారం ఈపూరుపాలెం వద్ద చోటు చేసుకుంది. చీరాల మండలం కావూరివారిపాలేనికి చెందిన విజయ్, శిరీష ద్విచక్రవాహనంపై వస్తుండగా ఈపురుపాలెం వద్ద ముందు వెళుతున్న కారు ఒక్కసారిగా సడన్ బ్రేక్ వేయడంతో వెనుక వస్తున్న ద్విచక్రవాహనం బలంగా ఢీకొంది. ఈ సంఘటనలో ద్విచక్రవాహనంపై ఉన్న ఇరువురికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను చీరాల్లోని ప్రైవేటు హాస్పిటల్‌కు తరలించారు. ఈ మేరకు అవుట్ పోస్టు పోలీసులు వివరాలను నమోదు చేశారు.

శింగరకొండ గోశాలకు దాణా వితరణ


దేవస్థాన గోశాలకు గడ్డిని అందజేస్తున్న దాతలు

అద్దంకి రూరల్: మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శింగరకొండలోని దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గోశాలకు అద్దంకి పట్టణానికి చెందిన సిద్ద పాండురంగారావు, సురేష్, బాలాజీలు తన సొంత పొలంలో పండిన గడ్డిని అందజేశారు. కార్యక్రమంలో కురిచేటి సాయికుమార్, కూరపాటి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

సీతారాం ఏచూరి ఆశయాలు కొనసాగించాలి

అద్దంకి రూరల్: సీతారం ఏచూరి ఆశయాల కొనసాగింపే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని మార్క్సిస్టు పత్రిక ఎడిటర్ ఎస్. వెంకటరావు అన్నారు. శుక్రవారం రాత్రి స్థానిక సుందరయ్య భవన్‌లో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సీపీఎం పూర్వ జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ప్రథమ వర్థంతి సభ నిర్వహించారు. పెట్టుబడిదారీ విధానానికి ప్రత్యామ్నాయం సోషలిజమే నన్నారు. సోషలిస్టు దృక్పథం కలిగిన దేశాలైన చైనా, కొరియా, రష్యా, వెనిజులా, వంటి దేశాలు ఆర్థిక పురోభివృద్ధిలో ఉన్నాయన్నారు. సీతారాం ఏచూరి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. డాక్టర్ వై. హనుమంతరావు, కె. రఘుచంద్, ఎస్. వెంకటరావు, బి. విజయ్ కుమార్ పాల్గొన్నారు.

వక్తృత్వ పోటీలతో వక్తలుగా ఎదగవచ్చు


బహుమతులు అందుకున్న విజేత విద్యార్థులు

వేటపాలెం: సమాజంలో మంచి వక్తలుగా ఎదగడానికే వక్తృత్వ పోటీలు నిర్వహిస్తున్నట్లు ప్రధానోపాధ్యాయురాలు దేవరకొండ సరోజని పేర్కొన్నారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో పూరా మస్తారావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 9,10 తరగతుల విద్యార్థులకు వక్తృత్వ పోటీలు శుక్రవారం నిర్వహించారు. ట్రస్టు చైర్మన్ మస్తానరావు మాట్లాడుతూ పాఠశాల దశ నుంచే సభలో స్వేచ్ఛగా, సొంత మాటలతో, హావభావాలతో ఎటువంటి బెరుకు లేకుండా తోటి విద్యార్థులతో మాట్లాడటం అలవాటు చేయడానికే ఇటు వంటి పోటీలు దోహద పడతాయన్నారు. చదువుకొనే దశలోనే విద్యార్థులు ఇదే విధంగా మాట్లాడటం అలవాటు చేసుకోవాలని సూచించారు. ఈ పోటీల్లో పి. మధుమిత, కె. సరివల్లి, పి. పార్థు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు పొందారు. విజేతలకు గోల్డ్, సిల్వర్, బ్రాంజ్ మెడల్స్‌తో పాటు సర్టిఫికెట్‌లు అందజేశారు. విశ్రాంత ప్రిన్సిపాల్ కె. నాగమాంబ, పర్చూరు, ఎంఈఓ ఏశివకోటేశ్వరరావు, ఉపాధ్యాయులు ఉమ్మిటి వేణుగోపాలరావు, కృష్ణమూర్తి, పద్మావతి, సుధారాణి, శివ రాజకుమారి, ఏవీ సుబ్బారావు, కె. సోమశేఖర్, అంజమ్మ, గురుమని, సునీత పాల్గొన్నారు.